సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం, 2, ఆగస్టు, 2023



బొగ్గు ఉత్పత్తిలో వెనుకంజ

జూలైలో కురిసిన వర్షాలు బొగ్గు ఉత్పత్తిపైప్రభావం చూపాయి. సింగరేణి లక్ష్యంలో 13 శాతం మేర ఉత్పత్తికి కోత పడింది. 10లో



యాష్‌పాండ్‌తో ప్రమాదమేనా?

జీటీపీఎస్ యాష్ పాండ్‌లో నీరు ప్రమాదకర స్థాయికి చేరుకుంది. కట్ట తెగితే పరిస్థితి అదుపుతప్పే అవకాశం ఉంది. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 29° / 25°

జిల్లాలో బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా చిరు జల్లులతో వాతావరణం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు వైభవంగా నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం వైభవంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళవారాన్ని పురస్కరించుకుని ఆంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో చండీహోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలో వేంచేసి ఉన్న శ్రీ పెద్దమ్మతల్లి ఆలయంలో అధిక శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని మంగళవారం చండీహోమం నిర్వహించారు. ముందుగా మేళతాళాలతో స్వామివారి ఉత్సవ విగ్రహాలను యాగశాలకు తీసుకొచ్చారు. మండపారాధన, గణపతి పూజ అనంతరం హోమం చేసి, చివరిగా పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. హోమంలో పాల్గొన్న 27 మంది భక్త దంపతులకు అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు రవికుమార్ శర్మ, నర్సింహమూర్తి, ఈఓ ఎన్.రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం, సభ్యులు వెంకటరామారావు, గంధం వెంగళరావు, కిలారు నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

జిల్లా జడ్జిని కలిసిన కలెక్టర్



జడ్జికి మొక్క అందజేస్తున్న కలెక్టర్

కొత్తగూడెంటౌన్: జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్‌ను కలెక్టర్ ప్రియాంక ఆల మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు విషయాలు చర్చించారు. కార్యక్రమంలో జిల్లా కోర్టు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అనితావాణి తదితరులు పాల్గొన్నారు.

జడ్జిని కలిసిన సింగరేణి జీఎం

జిల్లా జడ్జి పాటిల్ వసంత్‌ను సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం శాలెంరాజు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

డీవైఎస్‌ఓగా బాధ్యతల స్వీకరణ



పరంధామరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న సీతారాం, ఉద్యోగులు

కొత్తగూడెంటౌన్: జిల్లా యువజన, క్రీడల శాఖాధికారిగా ఎం.పరంధామరెడ్డి మంగళవారం విధుల్లో చేరారు. ఖమ్మం డీవైఎస్‌ఓగా పనిచేస్తున్న ఆయనను జిల్లాకు బదిలీ చేయగా, ఇన్‌చార్జ్ డీవైఎస్‌ఓ టి.సీతారాం నుంచి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ ప్రియాంక ఆలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు పరంధామరెడ్డికి సీతారాంతో పాటు కార్యాలయ ఉద్యోగులు ఉదయ్‌కుమార్, తిరుమలరావు, లక్ష్మణ్ శుభాకాంక్షలు తెలిపారు.

రేపు సదరం క్యాంప్

చుంచుపల్లి: జిల్లాలోని దివ్యాంగుల కోసం ఈనెల 3న కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రిలో సదరం క్యాంప్ నిర్వహించనున్నట్లు డీఆర్డీఏ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17, 24 తేదీల్లో కూడా శిబిరాలు ఉంటాయని, అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కబ్జాల్లో కొత్త ట్రెండ్!



సింగరేణి స్థలంలో నిర్మించిన రేకుల షెడ్డు

ముందు షెడ్డు వేసి, తర్వాత స్థలం ఆక్రమణ

- క్రమబద్ధీకరణకు జీఓ 76తో సరికొత్త అర్థాలు
- సింగరేణి భూములపై కొరవడిన పర్యవేక్షణ
- ఖాళీ స్థలాలపై అక్రమార్కుల కన్ను

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా కేంద్రంలో ఇల్లు కట్టుకునేందుకు అనువైన స్థలం దొరకక ఎంతోమందికి ఇబ్బందులు ఎదురవుతుంటే మరోవైపు విలువైన ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం అవుతున్నాయి. స్థలాల రక్షణను సింగరేణి, రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారులు గాలికి వదిలేశారు. దీంతో ఏక్.. దో.. తీన్.. అన్నట్టుగా ఒకదాని వెంట ఒకటిగా స్థలాలు కబ్జాకు గురవుతున్నాయి.

రెవెన్యూ స్థలం.. సింగరేణికి లీజ్

బొగ్గు తవ్వకాల కోసం కొత్తగూడెం, ఇల్లెందు ఏరియాల్లో రెవెన్యూ శాఖకు చెందిన స్థలాన్ని సింగరేణి లీజుకు తీసుకుంది. బొగ్గు ఉత్పత్తిలో పాలుపంచుకునేందుకు వేర్వేరు ప్రాంతాల నుంచి వచ్చిన కార్మికులు క్రమంగా ఇక్కడే స్థిరపడ్డారు. వీరు నివాసం ఉండేందుకు తమ ఆధీనంలో ఉన్న స్థలాల్లో సింగరేణి సంస్థ సొంతంగా కొన్ని క్వార్టర్లు నిర్మించి ఇవ్వగా, మిగిలిన స్థలాల్లో కార్మికులే తమ స్వార్జితంతో నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. అయితే సింగరేణి లీజు స్థలంలో ఉన్న నిర్మాణాలన్నీ రెవెన్యూ పరిభాషలో అక్రమ కట్టడాలుగానే తేలింది. దీంతో వీటికి మార్కెట్ విలువ లేకుండాపోయింది. అయితే సింగరేణి సంస్థ తీసుకున్న 99 ఏళ్ల లీజు గడువు 2010కి ముందే ముగిసింది. దీంతో సింగరేణి ఆధీనంలో ఉన్న అనేక స్థలాలు తిరిగి రెవెన్యూ పరిధిలోకి వచ్చాయి. సింగరేణి స్వయంగా కార్మికుల కోసం నిర్మించిన క్వార్టర్లు, కాలనీలు ఇప్పటికీ సంస్థ పరిధిలోనే ఉన్నాయి.

క్రమబద్ధీకరణకు జీఓ 76..

సింగరేణి నుంచి రెవెన్యూకు భూబదలాయింపు జరిగిన తర్వాత అక్కడున్న నిర్మాణాలను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా 76 నంబర్‌తో ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం కొత్తగూడెంలో 2014కు పూర్వం నిర్మించి నివాస యోగ్యంగా ఉన్న ఇళ్ల క్రమబద్ధీకరణకు అర్హత ఉంది. ఈ జీఓ ప్రకారం సదరు నిర్మాణం నివాస యోగ్యంగా ఉండాలి. ఖాళీ స్థలాలు, చిన్న రేకుల షెడ్లు, పాడుబడిన ఇళ్ల క్రమబద్ధీకరణకు అర్హమైనవి కావు. అయితే దశాబ్దాల పాటు తమ ఇళ్ల, ఇంటి స్థలాలపై ఎలాంటి హక్కులేని ప్రజలకు ఈ జీఓ వరప్రదాయినిగా మారింది. దీంతో చాలా మంది ఇళ్లను క్రమబద్ధీకరించుకున్నారు. మరోవైపు కొత్తగూడెంలో క్రమంగా బొగ్గు ఉత్పత్తి తగ్గడంతో సంస్థ ఆధీనంలో ఉన్న అనేక స్థలాలు నిరుపయోగంగా మారాయి. వాటిని అటు రెవెన్యూ శాఖకు అప్పగించక, ఇటు సింగరేణి సైతం రక్షణ విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకపోవడంతో అలుసుగా తీసుకున్న పలువురు ఇష్టారీతిన భూములు ఆక్రమించుకుంటున్నారు.

తాజాగా ఎల్‌ఐసీ రోడ్డులో..

పోస్టాఫీస్ సెంటర్ నుంచి ఎల్‌ఐసీ ఆఫీసుకు వెళ్లే దారిలో ప్రకాశ్‌నగర్ దగ్గర తాజాగా 500 గజాల సింగరేణి స్థలాన్ని కబ్జా చేసే ప్రయత్నాలు ఊపందుకున్నాయి. ఈ స్థలంలో దశాబ్దాల తరబడి ఇల్లు ఉన్నట్టుగా డోర్ నంబర్ సంపాదించారు. దీని ఆధారంగా క్రమబద్ధీకరణకు రెండేళ్ల క్రితం ప్రయత్నాలు చేయగా అవి బెడిసి కొట్టాయి. అప్పటి నుంచి ఈ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు జరగలేదు. పిచ్చి మొక్కలతో నిండిపోయి ఉంది. అయితే ఈ స్థలంపై కన్నేసిన వ్యక్తులు మరోసారి రంగంలోకి దిగారు. ఇటీవల రాత్రికి రాత్రే ఇక్కడున్న 500 గజాల స్థలంలో ఓ చిన్న రేకుల షెడ్డు నిర్మించారు. ఈ కబ్జా పర్వంలో మిగిలిన అంకం పూర్తి చేసేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు.

అక్రమార్కుల వక్రమార్గాలు..

జీఓ నంబర్ 76కు వక్రభాష్యాలు చెబుతూ మున్సిపాలిటీ పరిధిలో ఖాళీగా ఉన్న స్థలాలపై అక్రమార్కుల కన్ను పడింది. ముందుగా స్థలం తమది అనిపించుకుంటే చాలనీ, ఆ తర్వాత ఏదో రకంగా దాన్ని క్రమబద్ధీకరించుకోవచ్చనే ధీమాతో కబ్జాలకు తెర లేపారు. ఖాళీ స్థలాల్లో చిన్న రేకుల షెడ్డు లేదా తాత్కాలికంగా ఓ పాక నిర్మిస్తున్నారు. ఆ ఇంటికి డోర్ నంబర్ ఇవ్వాలంటూ మున్సిపాలిటీకి దరఖాస్తు చేస్తున్నారు. ఇలాంటి ఇంటి నిర్మాణ కోసం మున్సిపాలిటీలో ప్రత్యేక కౌంటర్లు పని చేస్తున్నాయి. చేతులు తడిపితే చాలు ఈ తాత్కాలిక ఇళ్లకు డోర్ నంబర్లు వచ్చేస్తున్నాయి. వీటిని ఆధారంగా చూపుతూ.. ఆ స్థలం తమదేనని, అక్కడ తాము నివాసం ఉంటున్నామని రికార్డులు సిద్ధం చేస్తున్నారు. ఈ కథను మరింతగా రక్తి కట్టించేందుకు క్షేత్రస్థాయిలో చేపట్టే తనిఖీల్లోనూ లక్షల రూపాయలు చేతులు మారుతున్నాయి. రాత్రికి రాత్రే వెలిసిన పూరిపాకలు, రేకుల షెడ్లు ఇరవై ఏళ్ల నుంచి ఉంటున్నట్టుగా సర్వేల్లో రికార్డవుతోంది. కొంచెం ప్లాన్ చేస్తే మూడు నుంచి నాలుగేళ్లలో 500 గజాల స్థలం కేవలం రూ.2 నుంచి రూ.3 లక్షల్లో కబ్జాదారుల సొంతం అవుతోంది. ఇలా రామవరం, కూలీలైన్, పోస్టాఫీస్ సెంటర్లలో సింగరేణి, రెవెన్యూ శాఖలకు చెందిన విలువైన స్థలాలు కబ్జారాయుళ్ల పరమయ్యాయి.

పరిశీలించి రద్దు చేస్తాం..

కొత్తగూడెంలోని ఎల్‌ఐసీ కార్యాలయం పక్కన ఉన్న సింగరేణి స్థలం కబ్జాకు గురైన విషయం నా దృష్టికి రాలేదు. ఆ స్థలంలో గతంలో జరిగిన విషయాలు నా నోటీసులో లేవు. అక్కడ నిర్మించిన గదికి ఇంటి నంబర్ కేటాయించినట్లు తెలియదు. పరిశీలించి, నిబంధనలకు విరుద్ధంగా ఉంటే ఇంటి నంబర్ రద్దు చేస్తాం.

– జి.రఘు, కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్

'స్థానిక' ఖాళీలు 257..

- 18 ఎంపీటీసీ, 18 సర్పంచ్, 221 వార్డులు
- హైకోర్టు సూచనతో త్వరలో ఉప ఎన్నికలు జరిగే అవకాశం !



మూకమామిడి గ్రామ పంచాయతీ కార్యాలయం

చుంచుపల్లి: చాన్నాళ్లుగా మరుగున పడిన ఉప ఎన్నికల అంశం తాజాగా మళ్లీ తెరపైకి వచ్చింది. పలు కారణాలతో ఖాళీగా ఉన్న ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహించక పోవడంపై హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. తక్షణమే ఎన్నికలు జరపాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ నేపథ్యంలో జిల్లాలో ఖాళీగా ఉన్న 257 సర్పంచ్, ఎంపీటీసీ, వార్డు సభ్యుల స్థానాలకు త్వరలో ఎన్నికలు జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. 2020 ఫిబ్రవరిలోనే ఎన్నికల నిర్వహణకు అధికారులు కసరత్తు చేసినా.. మార్చిలో కరోనా ప్రభావంతో వాయిదా వేయాల్సి వచ్చింది. అనంతరం గతేడాది ఏప్రిల్‌లో మరోసారి సన్నాహాలు చేశారు. 2022 జనవరిలో ఓటరు జాబితా ఆధారంగా పోలింగ్ కేంద్రాలను సైతం సిద్ధం చేసినా.. అనివార్య కారణాలతో ఉప ఎన్నికల ప్రక్రియ ఆగిపోయింది. ఆ తర్వాత ప్రభుత్వం ఉపపోరు ఊసే ఎత్తకపోవడంతో ఇక ఎన్నికలు జరుగుతాయో.. లేదోనని భావిస్తున్న తరుణంలో హైకోర్టు ఆదేశాలతో ఈ అంశం మళ్లీ తెరపైకి వచ్చింది.

జిల్లాలో ఖాళీలివే..

2019 జనవరిలో గ్రామ పంచాయతీలకు మూడు విడతలుగా ఎన్నికలు నిర్వహించారు. అప్పుడు పాల్వంచ మండలంలోని సంగం, నారాయణరావుపేట ఎస్సీ కాలనీ పంచాయతీలకు రిజర్వేషన్ ప్రకారం తగిన సర్పంచ్ అభ్యర్థులు లేక ఆయా స్థానాల్లో ఎన్నికలు జరగలేదు. అదే ఏడాది మేలో జిల్లాలోని 209 ఎంపీటీసీ, 21 జెడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. బూర్గంపాడు మండల ప్రజాపరిషత్‌కు కాలపరిమితి ముగియకపోవడంతో అక్కడ ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించలేదు. అయితే ఎన్నికలు జరిగిన గ్రామాల్లోనూ పలు కారణాలతో కొన్ని స్థానాలు ఖాళీ అయ్యాయి. తాజాగా అధికారులు సేకరించిన వివరాల ప్రకారం జిల్లాలో 18 ఎంపీటీసీ, 18 సర్పంచ్ స్థానాలతో పాటు 221 గ్రామ పంచాయతీ వార్డు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. బూర్గంపాడు మండలంలోని 11 ఎంపీటీసీ స్థానాలతో పాటు ములకలపల్లి మండలం సీతారాంపురం, చర్లలో ఆర్ కొత్తగూడెం, కుర్నపల్లి, చుంచుపల్లిలో రుద్రంపూర్–1, కరకగూడెంలో అనంతారం, ఇల్లందులో రేపల్లెవాడ, గుండాల ఎంపీటీసీ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. అశ్వారావుపేట మండలం జమ్మిగూడెం, అనంతారం, చంద్రుగొండ, లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల, సుజాతనగర్ మండలం కోమటిపల్లి, చర మండలం చిన్నమిడిసిలేరు–జి, దమ్మపేటలో శ్రీరాంపురం, గుండాలలో లింగగూడెం, సాయనపల్లి, జూలూరుపాడు, ములకలపల్లిలో గుట్టగూడెం, మూకమామిడి, పాల్వంచలో నారాయణరావుపేట ఎస్సీ కాలనీ, సంగం, దంతెలబోర ఎస్సీ కాలనీ, పాండురంగాపురం, అన్నపురెడ్డిపల్లిలో పెద్దిరెడ్డిగూడెం, పినపాకలో టి– కొత్తగూడెం గ్రామాల్లో సర్పంచ్ స్థానాలకు ఉప ఎన్నికలు జరపాల్సి ఉంది. వీటితోపాటు పలు పంచాయతీల్లో 221 వార్డులు ఖాళీగా ఉన్నాయి. ఇందులో ములకలపల్లి మండలంలో 97 వార్డుల్లో కొందరు అభ్యర్థులు 2019 ఎన్నికల సమయంలో లెక్కలు సరిగా చూపనందున ఎన్నికల సంఘం వారిపై అనర్హత వేటు వేసింది. కాగా, ప్రస్తుత పాలక వర్గాల పదవీకాలం 2024 జనవరితో ముగియనుంది.

'ఓపెన్' విధానంపై అవగాహన కల్పించాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, డీఈఓ

కొత్తగూడెంఅర్బన్: ఓపెన్ స్కూల్ విధానంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని కలెక్టర్ ప్రియాంక ఆల అన్నారు. తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం 2023 – 24 విద్యా సంవత్సర వాల్‌పోస్టర్‌ను మంగళవారం విద్యాశాఖాధికారులతో కలిసి ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ విద్యా సంవత్సరంలో ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల నమోదుకు అధికారులంతా సహకరించాలని ఆదేశించారు. రెగ్యులర్‌గా పాఠశాలకు వెళ్లి చదువుకోలేని విద్యార్థులతో పాటు, వయోజనులు, గృహిణులు ఓపెన్‌స్కూల్ ద్వారా చదువుకునేలా చూడాలని సూచించారు. ఇందులో అడ్మిషన్ పొందిన వారు ఉపాధి మార్గాలను వదులుకోకుండా ప్రామాణిక విద్యార్హతను పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో డీఈఓ సోమశేఖర శర్మ, ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ మద్దినేని పాపారావు, సీఎంఓఎస్ కె.సైదులు, ప్లానింగ్ కోఆర్డినేటర్ సతీష్ కుమార్ పాల్గొన్నారు.

లావాదేవీల్లో డీసీసీబీ భేష్

- రూ.1,080 కోట్ల డిపాజిట్లతో రాష్ట్రంలో రెండో స్థానం
- పంట రుణాలుగా రూ.1,300 కోట్లు
- డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ నాగభూషణం, పక్కన సీఈఓ వీరబాబు

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) జూలై 31 నాటికి రూ.2,805 కోట్ల టర్నోవర్‌తో రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచిందని చైర్మన్ కూరాకుల నాగభూషణం వెల్లడించారు. ఖమ్మంలోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టర్నోవర్‌లో కరీంనగర్ డీసీసీబీ ప్రథమ స్థానంలో ఉండగా, ఆ తర్వాత ఖమ్మం అందరి కృషితో రెండో స్థానం దక్కించుకుందని తెలిపారు. మూడేళ్ల క్రితం బలహీనమైన స్థితిలో ఉన్న బ్యాంకును నేడు రూ.1,080 కోట్ల డిపాజిట్లు, రూ.1,724 కోట్ల రుణాలతో ముందడుగు వేయించామని చెప్పారు. సేకరించిన డిపాజిట్లను రైతులు, సామాన్య ప్రజలకు రుణాలుగా అందిస్తున్నామని, పంట రుణాలు మంజూరులో ప్రథమ స్థానంలో నిలిచామని తెలిపారు. 2022–23లో వానాకాలం, యాసంగి సీజన్లలో పీఏసీఎస్‌లు రూ.570.02 కోట్ల మేర వ్యాపారం చేసి రూ. 81 కోట్ల లాభాలు గడించాయని వివరించారు. డీసీసీబీ పరిధిలోని సహకార సంఘాల్లో అర్హత కలిగిన సభ్యులందరికీ 2022 నుంచి బీమా చేయిస్తున్నట్లు చైర్మన్ తెలిపారు.

రైతులకు విరివిగా రుణాలు

ఈ ఏడాది వానాకాలం, యాసంగి సీజన్లకు గాను రూ.1,300 కోట్ల మేర రైతులకు పంట రుణాలుగా ఇచ్చామని చైర్మన్ చెప్పారు. రైతులు ఈ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని, ఏడాదిలోగా చెల్లించి రెన్యూవల్ చేసుకోవచ్చని తెలిపారు. సకాలంలో చెల్లించకపోతే మాత్రం 14 శాతం వడ్డీ పడుతుందని చెప్పారు. ఇంకా ఖాతాదారులు, వ్యాపారులకు రూ.340 కోట్ల మేర బంగారు ఆభరణాలపై రుణాలు ఇచ్చామన్నారు. అలాగే, విదేశాలకు వెళ్లే రైతుల పిల్లలకు విదేశీ విద్యాపథకం ద్వారా 900 మంది రుణాలు ఇచ్చామన్నారు. కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు టర్నోవర్‌ను రూ.3వేల కోట్లకు చేర్చాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని చైర్మన్ తెలిపారు. తప్పుడు ధ్రువపత్రాలతో రుణాలు తీసుకుని బ్యాంకును మోసం చేసిన వారిపై చర్యలు తప్పవని కూరాకుల స్పష్టం చేశారు. ఇప్పటికే 23 మందిని గుర్తించగా, వీరిలో ఇద్దరు చెల్లించారన్నారు. మిగతా వారిపై శాఖాపరమైన విచారణలు పూర్తికాగా, దర్యాప్తు చేస్తోందని వివరించారు. ఈ సమావేశంలో బ్యాంకు సీఈఓ అట్లూరి వీరబాబు పాల్గొన్నారు.

పారదర్శక జాబితాకు సహకరించాలి

అదనపు కలెక్టర్ రాంబాబు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాంబాబు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఎన్నికల ప్రక్రియలో పారదర్శక ఓటరు జాబితా ప్రధానమని, తయారీలో పార్టీల పాత్ర కీలకమని అదనపు కలెక్టర్ పి.రాంబాబు అన్నారు. ఐడీఓసీలో మంగళవారం ఆయన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అక్టోబర్ 4న ప్రకటించనున్న తుది జాబితాలో పొరపాట్లకు తావులేకుండా చూడాలని కోరారు. ఏవైనా పొరపాట్లు రాజకీయ పార్టీల ప్రతినిధుల దృష్టికి వచ్చినా తెలియజేయాలన్నారు. ఓటు ప్రాధాన్యతపై అవగాహన కల్పించేందుకు మొబైల్ వాహనాల ద్వారా ప్రచారం చేస్తామని చెప్పారు. ఐడీఓసీలో కూడా మాక్ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సురేష్‌కుమార్, సిబ్బంది నవీన్, అన్నవరపు సత్యనారాయణ(సీపీఎం), అన్వర్‌షేక్(బీఆర్‌ఎస్), కంచర్ల జమలయ్య, వై శ్రీనివాసరెడ్డి(సీపీఐ), లక్ష్మణ్ అగర్వాల్(బీజేపీ) పాల్గొన్నారు.

సోనియా రుణం తీర్చుకుందాం

- అంతా కలిసికట్టుగా పనిచేద్దాం
- ప్రజలు కష్టాల్లో ఉంటే కేసీఆర్ మహారాష్ట్ర వెళ్తాడా..
- భద్రాచలానికి శాశ్వత పరిష్కారం చూపడంలో విఫలం
- టీపీసీసీ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి





ఇల్లెందు సభలో మాట్లాడుతున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పక్కన పొదెం వీరయ్య, కోరం కనకయ్య తదితరులు (ఇన్‌సెట్) కొత్తగూడెంలో ప్రదర్శన

కొత్తగూడెంఅర్బన్/ఇల్లెందు : పోరాడి సాధించుకున్న తెలంగాణలో రెండుసార్లు అధికారంలోకి వచ్చిన సీఎం కేసీఆర్ సాధించింది ఏమీ లేదని, మళ్లీ పిట్టలదొర మాటలతో ప్రజలను మోసం చేసి గెలవాలని చూస్తున్నారని టీపీసీసీ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులంతా సమష్టిగా కృషి చేసి రాష్ట్రంలో పార్టీని అధికారంలోకి తేవాలని, తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ రుణం తీర్చుకోవాలని పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన కొత్తగూడెం, ఇల్లెందులో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వర్షాలు, వరదలతో ముంపునకు గురైన ప్రాంతాలను పట్టించుకోకుండా పక్క రాష్ట్రంలో అధికారం కోసం కేసీఆర్ తపనపడుతున్నాడని ఎద్దేవా చేశారు. ఇటీవలి వర్షాలు, వరదలతో భద్రాచలం ఎగువ, దిగువ ప్రాంతాలతో పాటు ఖమ్మంలో మున్నేరుకు ఇరువైపులా ఉన్నవారు, ముర్రేడువాగు ప్రాంత ప్రజలు ఇబ్బంది పడ్డారని తెలిపారు. తాను గతంలో కూడా ముంపు ప్రాంత పరిస్థితిని కేసీఆర్‌కు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతేడాది వరదల సందర్భంగా భద్రాచలం వచ్చిన సీఎం ముంపు బాధితులకు రూ.1000 కోట్లతో ఎత్తయిన ప్రాంతాల్లో ఇళ్ల నిర్మిస్తామని ఇచ్చిన హామీ నేటికీ కార్యరూపం దాల్చలేదన్నారు. ఖమ్మంలోని మున్నేరుపై తీగల వంతెనకు రూ.280 కోట్లు ప్రకటించారని, అవి విడుదల చేయకుండానే నిన్నటి కేబినెట్ మీటింగ్‌లో ఆర్‌సీసీ వాల్‌కు రూ.150 కోట్లు ప్రకటించారని విమర్శించారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తున్నట్లు చేసిన ప్రకటన హర్షణీయమే అయినా ఎన్నికలు వస్తున్నాయి కాబట్టే వారు గుర్తుకు రావడం సరికాదన్నారు. 27 రోజులుగా సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులను పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేసిన సీతారామా ప్రాజెక్టు అడ్రస్ లేకుండా పోయిందని విమర్శించారు. టికెట్ ఎవరికి ఇచ్చినా ఉమ్మడి జిల్లాలో పది స్థానాలను గెలుచుకుందామన్నారు. డీసీసీ అధ్యక్షుడు, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య మాట్లాడుతూ అందరం కలిసికట్టుగా ఉండి ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య మాట్లాడుతూ.. 2014లో తనను కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా గెలిపించిందని, ఆ తర్వాత అభివృద్ధి కోసం పార్టీ మారినా తిరిగి పొంగులేటితో కలిసి కాంగ్రెస్‌లో చేరానని తెలిపారు. పార్టీ టికెట్ ఎవరికి వచ్చినా విజయం కోసం కృషి చేద్దామని పిలుపునిచ్చారు. అంతకుముందు కొత్తగూడెం, ఇల్లెందులో భారీగా మోటార్‌సైకిళ్లతో ర్యాలీ నిర్వహించారు. ఇల్లెందు, గార్ల, టేకులపల్లి, బయ్యారం మండలాల నుంచి 78 మంది ప్రజాప్రతినిధులతో పాటు వివిధ పార్టీల నుంచి సుమారు 500 మంది, కొత్తగూడెంలో పలువురు కాంగ్రెస్‌లో చేరారు. ఆయా కార్యక్రమాల్లో టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ, సభ్యులు నాగా సీతారాములు, పాయం వెంకటేశ్వర్లు, విజయాబాయి, తుళ్లూరి బ్రహ్మయ్య, తెల్లం వెంకటరావు, భూక్యా దళ్‌సింగ్‌నాయక్, డాక్టర్ జి. రవి, రాంచందర్‌నాయక్, చీమల వెంకటేశ్వర్లు, బానోతు విజయలక్ష్మి, ఊకంటి గోపాల్‌రావు, ఆళ్ల మురళి, తూము చౌదరి, రాయల శాంతయ్య, బొమ్మిడి మల్లికార్జున్, అంతోటి పాల్, సకినాల వెంకటేశ్వరరావు, పల్లపు వెంకటేశ్వర్లు, డానియేల్, సైదులు, యదళ్లపల్లి అనసూర్య తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీలకు ఉచిత శిక్షణ

కొత్తగూడెంరూరల్: తెలంగాణ మైనార్టీ స్టడీ సర్కిల్, మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న మైనార్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి కె.సంజీవరావు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఆసక్తి కలిగి, డిగ్రీ పూర్తి చేసిన మైనార్టీ అభ్యర్థులు https://docs.google.com లింక్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. అభ్యర్థులకు 60 రోజుల పాటు ఉచితంగా శిక్షణ ఇస్తారని వివరించారు.

'ముస్కాన్'తో 35 మందికి రక్షణ

ఎస్పీ వినీత్ వెల్లడి

కొత్తగూడెంటౌన్: కొత్తగూడేన్ని బాలకార్మిక రహిత జిల్లాగా మార్చడమే పోలీసుల ప్రధాన లక్ష్యమని ఎస్పీ డాక్టర్ వినీత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా జూలై 1 నుంచి 31 వరకు ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం నిర్వహించామని, వెట్టిచాకిరీ చేస్తున్న 35 మంది బాలబాలికలకు విముక్తి కలిగించామని పేర్కొన్నారు. ఇందులో 30 మంది బాలురు, ఐదుగురు బాలికలు ఉన్నారని, వ్యాపార సముదాయాలు, పరిశ్రమలు, ఇతర ప్రదేశాల్లో వారితో పని చేయిస్తున్న 28 మందిపై కేసులు నమోదు చేశామని వివరించారు. చిన్నారుల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన 10 మంది బాలురు, ఒక బాలిక కూడా ఉన్నారని తెలిపారు. పనుల నుంచి విముక్తి కల్పించిన వారిలో 33 మంది బాలబాలికలను తల్లిదండ్రులకు అప్పగించామని, ఇద్దరిని బాలుర సంరక్షణ గృహంలో ఉంచామని తెలిపారు. ఆపరేషన్ ముస్కాన్ బృందంలో పని చేసిన అన్ని శాఖల అధికారులను ఆయన అభినందించారు.

క్లుప్తంగా

ఎస్‌ఐ జితేందర్‌కు సీఐగా పదోన్నతి


ఎస్‌ఐ జితేందర్

అశ్వాపురం: స్థానిక ఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తున్న సముద్రాల జితేందర్‌కు సీఐగా పదోన్నతి కల్పిస్తూ మల్టీజోన్–1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, సీఐగా పదోన్నతి పొందిన జితేందర్‌ను అశ్వాపురం, బూర్గంపాడు మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, ఇతరులు సన్మానించారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్ వైరు చోరీ


ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసిన దుండగులు

దుమ్ముగూడెం: మండలంలోని సీతానగరం గ్రామంలో రైతు కొమరం దామోదర్‌రావు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైరును గుర్తుతెలియని దుండగులు సోమవారం అపహరించారు. బాధితుడి కథనం ప్రకారం.. వ్యవసాయంలో రెండు పంటలు పండించేందుకు గాను 2009లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తన పొలంలో ఏర్పాటు చేసుకున్నాడు. పది అడుగుల ఎత్తులో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కాపర్ వైరును చోరీ చేశారని బాధితుడు వాపోయాడు. గతంలో కూడా మోటార్‌కు చెందిన కాపర్ వైరును అపహరించారని చెప్పాడు. ఈ ఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని దామోదర్ రావు వెల్లడించాడు.

జూదరులు అరెస్ట్

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం అనిశెట్టిపల్లి అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్న నలుగురిని మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు అనిశెట్టిపల్లి అటవీ ప్రాంతంలో పోలీసులు తనిఖీ చేపట్టి పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.25 వేలను స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేశారు.

యువకుడు అదృశ్యం

దమ్మపేట: మండలంలోని దురదపాడు గ్రామానికి చెందిన యువకుడు కనిపించకుండా పోయిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన గణప నాగరామకృష్ణ (25) గత నెల 23వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. ఆందోళన చెందిన భార్య సౌజన్య అతడి మొబైల్‌కు పలుమార్లు ఫోన్ చేయగా స్విచ్‌ఆఫ్ వచ్చింది. కుటుంబ సభ్యులతో కలిసి ఆమె పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు.

భార్యను వేధిస్తున్న వ్యక్తిపై కేసు

పాల్వంచరూరల్: అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్న భర్తపై స్థానిక పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ కార్తీక్ కథనం మేరకు..మండలంలోని లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన, వ్యవసాయ కూలీ పని చేసుకునే మహ్మద్ పాషాతో హర్షపర్వీన్‌కు రెండేళ్ల కిందట వివాహం జరిగింది. అయితే, పాషా కొద్ది రోజులుగా అదనపు కట్నం తేవాలని భార్యను వేధిస్తున్నాడు. నెల రోజుల కిందట పర్వీన్ పుట్టింటికి వెళ్లింది. అక్కడికి కూడా వచ్చి వేధిస్తున్నాడని మంగళవారం పర్వీన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పాషాతోపాటు అతడి అన్న జానీపాషా, తమ్ముడు బాజీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మున్నేరులో రైతు గల్లంతు

ముదిగొండ: విద్యుత్ మోటార్ పరిశీలనకు వెళ్లిన ఓ రైతు మున్నేటి వరదలో గల్లంతయ్యాడు. మండలంలోని గంధసిరికి చెందిన రైతు చమట కొండల్‌రావు మంగళవారం పొలం వద్దకు వెళ్లాడు. మోటారు స్విచ్ వేసినా నీళ్లు రాకపోవడంతో మున్నేరులోని నీటిలో ఉన్న మోటార్‌ను పరిశీలిస్తుండగా ప్రమాదవశాత్తు పడిపోయాడు. ఆయనకు ఈత రాకపోవడంతో నీటి ప్రవాహానికి కొట్టుకుపోగా, ఆయన వెంట మెకానిక్, మరో రైతు స్థానికులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్‌ఐ నరేష్, సిబ్బంది చేరుకుని గ్రామస్తుల సహకారంతో గాలింపు చేపట్టినా రాత్రివరకు రైతు ఆచూకీ లభించలేదు.

జాలర్ల వలలో కొండచిలువ!

నేలకొండపల్లి: మండలంలోని నాచేపల్లి వాగులో జాలర్లు చేపల కోసం ఏర్పాటు చేసిన వలలో కొండ చిలువ చిక్కుకుంది. గ్రామానికి చెందిన జాలర్లు మంగళవారం వాగులో వలలు ఏర్పాటు చేసుకున్నారు. ఇందులో ఎనిమిది అడుగులు పొడవు, 30 కేజీలకు పైగా బరువు ఉన్న కొండ చిలువ చిక్కుకుని మృతి చెందింది.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,623

యాష్ పాండ్‌తో ప్రమాదమేనా?

- కురుస్తున్న వర్షాలకు పెరుగుతున్న నీటి మట్టం
- భయాందోళనలో పరిసర ప్రాంత ప్రజలు
- పట్టించుకోని బీటీపీఎస్ అధికారులు

మణుగూరురూరల్: దేశం, రాష్ట్ర ప్రజలకు విద్యుత్ వెలుగులు అందించేందుకు 1080 మెగావాట్ల సామర్థ్యంతో మణుగూరులో భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ ఏర్పాటైంది. విద్యుత్ ఉత్పాదనలో బొగ్గు ఎంతో కీలకమైంది. బొగ్గును మండించగా వెలువడే బూడిదను నిల్వ చేసేందుకు ప్రత్యేకంగా యాష్ పాండ్‌ను ఏర్పాటు చేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు యాష్ పాండ్‌లో నీటి మట్టం భారీగా పెరిగి ప్రమాదకరస్థాయికి చేరుకుంది. యాష్ పాండ్ కట్ట తెగితే పరిస్థితి అదుపుతప్పే అవకాశం ఉంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రామగుండంలోని బీ–పవర్ హౌస్ బూడిద చెరువు కట్ట తెగి అక్కడి కాలనీవాసుల ఇళ్లల్లోకి చేరి ఇబ్బందులు ఎదుర్కొన్న విషయం తెలిసిందే. బీటీపీఎస్ యాష్ పాండ్‌తో ప్రజలకు ప్రమాదం పొంచి ఉండగా.. గోదావరి వరద ప్లాంట్ వరకు చేరుకుని నష్టం వాటిల్లే అవకాశం కూడా ఉంది.

అనారోగ్య సమస్యలతో సతమతం..

యాష్ నీటిని బీటీపీఎస్ అధికారులు పంపుల ద్వారా స్థానికులు ఉపయోగించే నీటి కొలనుల్లోకి, కాలువల్లోకి వదులుతున్నారు. దీంతో స్థానికులు నిత్యం ఉపయోగించే నీరు కలుషితమతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యాష్‌పాండ్ కారణంగా ఇటు వాయు, అటు జల కాలుష్యం పెరిగిపోవడంతో చుట్టుపక్కల గ్రామాలైన చిక్కుడుగుంట, దమ్మక్కపేట, సాంబాయిగూడెం, రామానుజవరం ప్రజలు చర్మ సంబంధిత వ్యాధులతో ఇబ్బందులు


చిక్కుడుగుంటలో ఉన్న బీటీపీఎస్ యాష్ పాండ్


యాష్ పాండ్ కలుషిత నీరు గోదావరిలో కలుస్తున్న దృశ్యం

పడుతూ ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. యాష్ పాండ్ ద్వారా తలెత్తుతున్న సమస్యలను పరిష్కరించాలని గతంలోనే స్థానికులతో పాటు అనేక సార్లు రాజకీయ నాయకులు, ప్రజా సంఘాల వారు బీటీపీఎస్ అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోతోంది. కురుస్తున్న భారీ వర్షాలకు యాష్ పాండ్ చుట్టూ ఉన్న కట్ట తెగిపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు యాష్‌పాండ్ కట్టపై దృష్టిసారించాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే, భవిష్యత్‌లో యాష్ పాండ్ చుట్టూ పటిష్టమైన గోడ నిర్మించాలని విజ్ఞప్తిచేస్తున్నారు.

స్పందించని బీటీపీఎస్ సీఈ

యాష్ పాండ్ కట్ట విషయమై వివరణ కోరేందుకు మణుగూరు బీటీపీఎస్ సీఈ బి.బిచ్చన్నను ఫోన్‌లో సంప్రదించగా ఆయన స్పందించలేదు.

రక్షణ చర్యలు చేపట్టాలి

భారీ వర్షాలకు యాష్ పాండ్ కట్టకు ప్రమాదం వాటిల్లే అవకాశం ఉంది. రెండు రోజుల కిందట కురిసిన వర్షాలకు వరద ఉధృతి బీటీపీఎస్ ప్లాంట్ వరకు చేరుకుంది. భారీ వర్షాలు కురిస్తే యాష్ పాండ్ కట్ట తెగకుండా చుట్టూ పకడ్బందీగా రక్షణ చర్యలు చేపట్టాలి. (ఫొటో లేదు)

– ఎస్.వెంకటేశ్వర్లు, దమ్మక్కపేట

పట్టా భూమిలో పనులను అడ్డుకున్న అధికారులు

జూలూరుపాడు: పోడు భూముల్లో కేవలం పంటలు సాగు చేసుకోవాలని, చెట్ల మొట్లు తొలగించడం, ఎత్తు పల్లాలను చదును చేయడం నిషేధమని, జేసీబీ, డోజర్ల లాంటి యంత్రాలు ఉపయోగించొద్దంటూ అటవీశాఖాధికారులు కొత్త వివాదానికి తెరలేపారు. మంగళవారం జూలూరుపాడు అటవీ రేంజ్, రాజుపాలెం సెక్షన్ పరిధిలో జూలూరుపాడు అటవీ బీట్‌లో ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టా పొందిన ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలం మున్యాతండాకు చెందిన జర్పుల లింగా డోజర్‌తో పొలాన్ని చదును చేయిస్తున్నాడు. విషయం తెలుసుకున్న బీట్ ఆఫీసర్ నరసింహారావు, సిబ్బందితో కలిసి ఘటనాస్థలానికి చేరుకొని పనులను అడ్డుకున్నారు. పోడు పట్టా భూముల్లో యంత్రాలను ఉపయోగించొద్దని, దున్నుకొని పంట సాగు చేసుకోవాలే తప్ప అటవీశాఖ అనుమతి లేకుండా పనులు చేయొద్దని బీట్ ఆఫీసర్ వాదించాడు. దీనికి ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టా ఇచ్చిన భూమిలో ఎత్తు పల్లాలున్నాయని, చెట్ల మొదళ్లు, ముళ్ల పొదలు తొలగించుకోకుండా పంట ఎలా సాగు చేయాలంటూ బీట్‌ఆఫీసర్‌ను లింగా ప్రశ్నించాడు. పోడు పట్టాతో రైతుబంధు, రైతు బీమా వర్తిస్తుందని, వ్యవసాయ బోరు కూడా ఏర్పాటు చేసుకోవచ్చని ప్రభుత్వం చెబుతుంటే యంత్రాలు ఉపయోగించొద్దంటే ఎలా అని రైతు


ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

అన్నాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. బీట్‌ఆఫీసర్ అక్కడి నుంచి వెళ్లేందుకు యత్నించగా ఎఫ్‌ఆర్‌ఓ వచ్చి సమాధానం చెప్పే వరకు ఇక్కడి నుంచి వెళ్లేందుకు వీల్లేదని లింగాతోపాటు పలువురు రైతులు ఆపారు. ఎఫ్‌ఆర్‌ఓ ప్రసాద్‌రావు ఫోన్‌లో బాధిత రైతు లింగాతో మాట్లాడి కార్యాలయానికి వచ్చి సమస్య పరిష్కరించుకోవాలని సూచించడంతో వివాదం సద్దుమణిగింది. డీఆర్‌ఓ ధనలక్ష్మి ఘటనాస్థలానికి చేరుకునే సమయానికి అక్కడి నుంచి రైతులు వెళ్లిపోయారు. అయితే, బీట్ ఆఫీసర్ నరసింహారావు తన విధులకు అడ్డుపడ్డాడని, వెళ్లకుండా నిర్బంధించాడని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రైతు లింగాపై ఫిర్యాదు చేశాడు. బీట్ ఆఫీసర్‌పై బాధిత రైతు ఏన్కూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

పెద్ద మొక్కలను అవెన్యూ ప్లాంటేషన్‌లో నాటాలి

చుంచుపల్లి : పెద్ద మొక్కలను అవెన్యూ ప్లాంటేషన్‌లో రోడ్లకు ఇరువైపులా నాటేలా చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జి.మధుసూదన్ రాజు సూచించారు. మంగళవారం ఆయన చుంచుపల్లి మండలంలోని వెంకటేశ్వర కాలనీ, బాబుక్యాంప్‌లలో నర్సరీలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హరితహారంలో ఇంటింటికీ ఆరు మొక్కలు పంపిణీ చేయాలని, ఆ వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని గ్రామ కార్యదర్శిని ఆదేశించారు. గ్రామాల వారీగా హరితహారం లక్ష్యాలను పూర్తి చేయాలని చెప్పారు. జామ, మునగ, సీతాఫలం, ఫెల్టో ఫోరం, రైన్ ట్రీ మొక్కలను పరిశీలించారు. గ్రామాల్లో ప్రధాన రహదారుల వెంట ఖాళీ స్థలాల్లో ఎత్తుగా ఉన్న మొక్కల మధ్యలో వాటిని నాటాలని సూచించారు. ఆయన వెంట ఏపీఓ రఘుపతి, ఈసీ నాగరాజు ఉన్నారు.


నర్సరీని పరిశీలిస్తున్న మధుసూదన్ రాజు

తండ్రి చేతిలో తనయుడి హత్య

- మద్యానికి బానిసైన కొడుకు వేధింపులు తాళలేక హతమార్చిన వైనం
- కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఘటన

కొత్తగూడెంటౌన్: వృద్ధాప్యంలో తమకు అండగా నిలవాల్సిన కుమారులు.. ఏ పనీ చేయకుండా తమపైనే ఆధారపడుతుండడం, మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని వేధిస్తుండడం, తాగి వచ్చాక ఇంట్లో గొడవ పడుతుండడంతో భరించలేని తండ్రి కుమారుడిని హత్య చేసిన ఘటన కొత్తగూడెంలో మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. కొత్తగూడెంలోని గౌతంనగర్‌కు చెందిన జమ్ముల రాజయ్యకు భార్య గిరిజ, కూతురు లక్ష్మి, కుమారులు రవి, శంకర్(36) ఉన్నారు. కూతురుకు పెళ్లి చేసి పంపించగా భార్య, ఇద్దరు కుమారులతో కలిసి ఉంటున్నాడు. రాజయ్య ఓ ప్రైవేట్ కళాశాల క్యాంటిన్‌లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పెద్ద కుమారుడు రవికి వివాహం చేసినా.. ఏ పనీ చేయకుండా జులాయిగా తిరుగుతుండడంతో కోడలు విడాకులు తీసుకుని వెళ్లింది. ఇద్దరు కుమారులు నిత్యం మద్యం తాగి ఘర్షణ పడుతుండేవారు. మద్యానికి డబ్బు ఇవ్వాలని తల్లిదండ్రులను వేధిస్తుండేవారు. సోమవారం సాయంత్రం కూడా డబ్బు కావాలని తల్లిని వేధించడంతో ఆమె రూ.300 ఇచ్చింది. రాజయ్య కాలేజీ నుంచి ఇంటికి వచ్చేసరికి అన్నదమ్ములిద్దరూ మద్యం తాగి గొడవపడుతున్నారు. రాత్రి వరకు కూడా గొడవ ఆగకపోవడంతో పెద్దకుమారుడు రవిని బయటకు పంపించి తెలిసిన వారి ఇంట్లో పడుకోవాలని చెప్పారు. ఇక శంకర్ తెల్లవారుజామున 4 గంటల వరకూ గొడవ చేస్తూనే ఉన్నాడు. తండ్రి ఎంత వారించినా వినకపోవడంతో భరించలేని రాజయ్య కుమారుడిపై గొడ్డలితో నరకగా, అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలియగానే కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ ఎం.కరుణాకర్ అక్కడికి చేరుకుని సమాచారం సేకరించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ కూడా ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి సోదరి లక్ష్మిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. 70 ఏళ్ల వయసులో తన తల్లిదండ్రులను సోదరులు వేధింపులకు గురి చేస్తున్నారని, ఇది భరించలేకే తండ్రి ఈ దారుణానికి పాల్పడ్డాడని లక్ష్మి రోదిస్తూ చెప్పింది. కాగా, రాజయ్య కొత్తగూడెం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయినట్లు సమాచారం.


తల్లిదండ్రులు, సోదరితో మృతుడు శంకర్ (ఫైల్)

భార్య ఆత్మహత్యకు కారణమైన కేసులో ఆరేళ్ల జైలు

ఖమ్మం లీగల్: భార్య ఆత్మహత్యకు కారణమైన ఏన్కూర్ మండలం గార్లఒడ్డు గ్రామానికి చెందిన బానోత్ చిన్న(లక్ష్మా)కు ఆరేళ్ల జైలుశిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువడింది. ఈమేరకు ఖమ్మం ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎస్.అమరావతి మంగళవారం వెలువరించి తీర్పు వివరాలిలా ఉన్నాయి. గార్లఒడ్డుకు చెందిన లక్ష్మా భార్య కంసాలి ఇంటి వద్దే ఉంటూ భర్త, పిల్లలను పట్టించుకోకుండా మద్యానికి బానిసైంది. 2014 జూలై 14న రాత్రి ఆయన ఇంటికొచ్చే సరికి కంసాలి మద్యం మత్తులో ఉండడంతో మందలించాడు. దీంతో ఆమె ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకోగా ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆగస్టు 4న మృతి చెందింది. ఘటనపై ఏన్కూర్ పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసును విచారణ అనంతరం లక్ష్మాకు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ బి.కృష్ణమోహన్ వాదించగా, సిబ్బంది ఎం.వెంకటేశ్వర్లు, ఓ.శ్రీనివాసరావు సహకరించారు.

అంతర్జాతీయ పోటీలకు ఎంపిక


సింధుతపస్వి


అఖిల్‌మహర్షి

పాల్వంచ: ఈ నెల 4నుంచి 6వ తేదీ వరకు మలేషియాలో జరిగే అంతర్జాతీయ తైక్వాండో క్రీడా పోటీలకు పాల్వంచకు చెందిన అంతర్జాతీయ క్రీడాకారిణి సింధుతపస్వి, అఖిల్‌మహర్షి ఎంపికయ్యారు. వీరు బుధవారం మలేషియాకు బయలుదేరి వెళ్లనున్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులు మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఆంజనేయగౌడ్, కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ వినీత్, కోచ్ జయంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యాసంస్థల్లో కలకలం

ఖమ్మంమయూరిసెంటర్/నేలకొండపల్లి: జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ గురుకుల కళాశాలలో కళ్ల కలక విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తోంది. సుమారు 200 మంది విద్యార్థులకు కళ్లకలకతో బాధపడుతుండగా వైద్యశిబిరం ఏర్పాటు చేయించినట్లు ఎస్సీ గురుకుల విద్యాలయాల సంస్థ ఆర్‌సీఓ ప్రత్యూష తెలిపారు. అలాగే, నేలకొండపల్లి మండలం సింగారెడ్డిపాలెంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో కూడా 20 మంది విద్యార్థినులకు కళ్లకలక సోకింది. ఒకరి ద్వారా మరొకరికి వ్యాపిస్తుండడంతో వీరికోసం ఐసోలేషన్ కేంద్రం ఏర్పాటు చేశారు. అలాగే, ప్రభుత్వ వైద్యులతో చికిత్స చేయించినట్లు ప్రిన్సిపాల్ ఉజ్వలకుమారి తెలిపారు.

తహసీల్దార్ల బదిలీలు

- జిల్లా నుంచి 17మందికి స్థానచలనం
- ఇతర జిల్లాల నుంచి 20మంది కేటాయింపు

ఖమ్మం సహకారనగర్: త్వరలో సాధారణ ఎన్నికలు జరిగే అవకాశం ఉన్న నేపథ్యాన ఎన్నికల కమిషన్ సూచనల మేరకు రాష్ట్రప్రభుత్వం శాఖల వారీగా ఉద్యోగులను బది లీ చేస్తోంది. ఇందులో భాగంగా తహసీల్దార్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈమేరకు జిల్లా నుంచి 17మందిని ఇతర జిల్లాలకు బదిలీ చేయగా, పొరుగు జిల్లాల నుంచి ఖమ్మంకు 20 మందిని కేటాయించారు. త్వరలోనే వీరికి పోస్టింగ్ ఇవ్వనున్నారు.

బదిలీ తహసీల్దార్లు వీరే..

జిల్లాలో విధులు నిర్వర్తిస్తూ ఇతర జిల్లాలకు బదిలీ అయిన తహసీల్దార్ల వివరాలి లా ఉన్నాయి. టి.శ్రీనివాసరావు, ఎస్.వీ. నారాయణమూర్తి, డి.సైదులు, సీహెచ్.రమణిని మహబూబాబాద్ జిల్లాకు కేటా యించారు. అలాగే, జి.కృష్ణను మెదక్ జిల్లాకు కేటాయించగా, హెచ్.రంగా, తుమాటి శ్రీనివాసరావు, డి.తిరుమలాచారి, దారా ప్రసాద్, గుడిమెట్ల శిరీష, కె.రవికుమార్, ఎం.మంగీలాల్, ఎం.రమాదేవి, డి.జగదీశ్వరప్రసాద్, వీ.వీ.శకుంతల, ఎం.డీ.ముజాహిద్, డి.పుల్లయ్యను భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు కేటాయిస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి.

జిల్లాకు ఎవరెవరంటే...

ప్రస్తుతం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తహసీల్దారుగా విధులు నిర్వర్తిస్తున్న కే.వీ.శ్రీనివాసరావు, ఏ.రాజేంద్రకుమార్, వి.సురేష్‌కుమార్, శివయ్య, పీ.వీ.రామకృష్ణ, సీహెచ్.శేషగిరిరావు, ఎం.ఉషాశారద, జి. లూథర్ విజన్, సీహెచ్.స్వామి, ఎం.ఏ. రాజు, ఈ.నాగేశ్వరావు, వి.రవికుమార్‌ను ఖమ్మం జిల్లాకు కేటాయించారు. అలాగే, మహబూబాబాద్ జిల్లా నుంచి ఏ.పున్నంచందర్, ఏ.రమేష్, కె.యోగీశ్వరరావు, పి.రాంప్రసాద్, వరంగల్ జిల్లా నుంచి ఎస్.సంపత్‌కుమార్, డి.మంజుల, జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుంచి వై.రామారావు, ములుగు జిల్లా నుంచి విజయ్ భాస్కర్‌ను ఖమ్మం కేటాయిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మిషన్ బ్లేడ్ తగిలి వ్యక్తి మృతి

అన్నపురెడ్డిపల్లి: మిషన్ బ్లేడ్ తగిలి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఏపీలోని గుడివాడకు చెందిన వేముల పెద్దిరాజు (30) కొంత కాలంగా ఖమ్మం జిల్లా వైరాలోని తన అత్తగారింట్లో ఉంటున్నాడు. జీవనోపాధి కోసం మండలంలోని శాంతినగర్ వద్ద నిర్మిస్తున్న రైల్వే వంతెన నిర్మాణ పనులు చేసేందుకు వారం కిందట వచ్చాడు. మంగళవారం తోటి కూలీలతో కలిసి పనులు చేపట్టిన నిర్మాణ సంస్థ క్యాంపు వద్ద ఇనుప చువ్వలు కత్తిరించే క్రమంలో మిషన్ బ్లేడ్ అతని ముఖానికి బలంగా తగిలింది. గమనించిన తోటి కూలీలు వెంటనే ఎర్రగుంట పీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, పిల్లలున్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

కల్లూరు: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న దంపతులు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. కల్లూరుకు చెందిన ట్టల లక్ష్మయ్య, రాధమ్మ ద్విచక్ర వాహనంపై మంగళవారం మిట్టపల్లి వెళ్తున్నారు. ఈక్రమంలో వీరిని ఖమ్మం వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు గాయపడగా లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు నకిరేకల్‌కు చెందిన లారీ డ్రైవర్ పల్లెపు వెంకన్నపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.


ఎడమ ప్రధాన కాలువకు పడిన భారీ గండి

తాలిపేరు ప్రధాన కాలువకు గండి

- ఎడమ ప్రధాన కాలువకు సాగునీరు నిలిపివేత

చర్ల: తాలిపేరు ఎడమ ప్రధాన కాలువకు భారీ గండి పడింది. మంగళ, బుధ వారాల్లో భారీగా కురిసిన వర్షాల వల్ల అటవీ ప్రాంతం నుంచి వచ్చిన వరదనీటి ప్రభావంతో కుదునూరు సమీపంలోని ప్రధాన కాలువకు గండి పడింది. అటవీ ప్రాంతం నుంచి వచ్చే వర్షపు నీటిని ఎడమ కాలువ కింది నుంచి జోడి చీలికల వాగులోకి మళ్లించేందుకు ప్రాజెక్ట్ కాలువ తీసిన సందర్భంలో ఏర్పాటు చేసిన యూటీ (అండర్ టన్నెల్)కి భారీగా వరదనీరు రావడంతో కాలువకట్టకు 20 అడుగుల లోతు, 15 అడుగుల వెడల్పుతో భారీ గండి ఏర్పడింది. దీంతో ఈ కాలువ ద్వారా విడుదలవుతున్న సాగునీటిని అధికారులు నిలిపివేశారు. ఈ కాలువ కింద అధికారికంగా 20,100 ఎకరాల్లో వరి పంట సాగవుతుండగా, ప్రస్తుతం సుమారు 10 వేల ఎకరాల్లో వరినాట్లు వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. సాగునీరు విడుదల నిలిపివేసిన విషయంతో తెలియడంతో రైతులు నాట్లు వేసే పనులను ఆపారు. మళ్లీ వర్షాలు కురియక ముందే కాలువకు పడిన గండిని పూడ్చి సాగునీటిని అందించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

500 కి.మీ. పూర్తి చేసుకున్న సైకిల్‌యాత్ర

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విద్యారంగ, సంక్షేమ హాస్టళ్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన సంఘర్షణ సైకిల్ యాత్ర ఐదు వందల కిలోమీటర్లు పూర్తి చేసుకుని మంగళవారం కొత్తగూడెం చేరుకుంది. ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ఈ సందర్భంగా సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సభకు డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష్య, కార్యదర్శులు లిక్కి బాలరాజు, కాళంగి హరికృష్ణ హాజరై మద్దతు తెలిపారు. యాత్ర రథసారథి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి బుర్రా వీరభద్రం మాట్లాడుతూ ప్రభుత్వాలు విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని విమర్శించారు. ప్రైవేట్ పాఠశాలలకు వత్తాసు పలుకుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న డీఈఓను తక్షణం విధుల నుంచి తొలగించాలని కోరారు. కార్యక్రమంలో యాత్ర బృందం సభ్యులు భూపేందర్, నాగకృష్ణ, రాంచరణ్, పవన్, ప్రవీణ్, వెంకటేశ్, అనిల్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న లిక్కి బాలరాజు

గోదావరి తగ్గుముఖం


భద్రాచలం వద్ద నెమ్మదించిన గోదావరి ప్రవాహం

భద్రాచలంటౌన్: భద్రాచలం వద్ద గోదావరి వరద ఉధృతి నెమ్మదిగా తగ్గుతోంది. రెండు రోజుల కిందట భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం 56.10 అడుగులకు చేరింది. అప్పటి నుంచి క్రమంగా తగ్గుతూ మంగళవారం రాత్రికి నీటి మట్టం 27 అడుగులకు చేరుకుంది. దీంతో పునరావాస కేంద్రాల్లోని ప్రజలంతా ఇళ్లకు చేరుకుంటున్నారు. కానీ, పట్టణంలోని కొత్తకాలనీలో ఇంకా గోదావరి బ్యాక్ వాటర్ నిలిచి ఉండటంతో ఆ కాలనీవాసులు పునరావాస కేంద్రంలోనే ఉన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Services

- మీ బంగారం తాకట్టులో ఉందా వడ్డీ చెల్లించ లేకపోతున్నారా తాకట్టులో ఉన్న బంగారం విడిపించి ఈ రోజు మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ : 7013501541 [H-788613]

GOLD FINANCE

- బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో ఉన్నవి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) సంప్ర. ✆ 99121 05656. [M-9881]
- బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్. ✆ 76508 91999 [B-781997]

OLD AGE HOME

- త్రివేణి హోంకేర్, వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకోవడానికి, వంట, ఇంటి పనికి వర్కర్స్‌ను మీ ఇంటికే పంపబడును. ఫోన్ :9160900023, 9160900024. [H-189313]

Wanted

- ప్రముఖ బ్యాంకింగ్ సంస్థలో పని చేయుటకు టెలికాలర్స్ కావలెను. అర్హత : ఏదైనా డిగ్రీ. ఫోన్ : 85559 78872, 84658 62775. ఖమ్మం. [M-1221478]
- ప్రముఖుల ఇళ్ల వద్దనే ఉండి వృద్ధులను, బెడ్ పేషెంట్లను చూసుకొనుటకు M/F కేర్ టేకర్స్, ఆయాలు, నర్సులు కావలెను. జీతం: 14-20K, వసతి + భోజనం, VJA. ✆ 91608 35559, 78158 35561 [B-250]
- జాబ్ గ్యారెంటీ మా కంపెనీ కొరకు మహిళలు వెంటనే కావలెను. ఫ్రీ రూమ్+ భోజనం +జీతం: 15–30వేల వరకు, (ఏజెంట్స్‌కి 5000 కమీషన్) ఫోన్ : 8886733005 [H-788930]

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!

సాక్షి క్లాసిఫైడ్స్

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి

వివరాలకు :

ఖమ్మం	9010299957, 9705444182
కొత్తగూడెం	9010223783
పాల్వంచ	9705444183
భద్రాచలం	9951602914
మణుగూరు	9705944416
సత్తుపల్లి	9652868642
మధిర	9949927792

సాక్షి ద్వారా మీ చిన్నారి పుట్టిన రోజు శుభాకాంక్షలను తెలియజేయండి కేవలం రూ. 500/- మాత్రమే (GST 5% అదనం)

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మంచిరేవుల భూములు ప్రభుత్వానివే

గ్రేహౌండ్స్‌కు బదలాయించాలంటూ సుప్రీంకోర్టు తీర్పు

" మంచిరేవులలోని ఈ భూములకు విలువ పెరగడంతో వాటిపై రాబందుల కళ్లు పడ్డాయని రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. ల్యాండ్ మాఫియా జోక్యం కూడా కనిపిస్తోంది. ఈ భూములపై సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు తుదివి. ఎలాంటి జోక్యాలు అనుమతించబోం"
– జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం



సాక్షి, న్యూఢిల్లీ: రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం మంచిరేవులలోని 142.39 ఎకరాల భూయాజమాన్య హక్కులు పూర్తిగా తెలంగాణ ప్రభుత్వానివేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. 1994 నుంచి కొనసాగుతున్న భూవివాదానికి ముగింపు పలికింది. ఆక్రమణకు గురైన ఈ భూములు గ్రేహౌండ్స్‌కు సంబంధించినవని పేర్కొంది. మంచిరేవుల భూములకు సంబంధించి హైకోర్టు ఆదేశాలు సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లు విచారించిన జస్టిస్ సూర్యకాంత్ , జస్టిస్ జేకే మహేశ్వరిలతో కూడిన ధర్మాసనం మంగళవారం తుదితీర్పు వెలువరించింది. మంచిరేవులకు సంబంధించిన భూములు ప్రైవేటు వ్యక్తులవేనని హైకోర్టు సింగిల్ జడ్జి ఆదేశాలు ఇవ్వగా, రాష్ట్ర ప్రభుత్వం డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. దీనిని విచారించిన డివిజన్ బెంచ్ 2021లో రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. దీన్ని సవాల్ చేస్తూ పలువురు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఇరుపక్షాల వాదనలు అనంతరం ఇచ్చిన తుదితీర్పులో.. ఆర్టికల్ 142 ప్రకారం అధికారాలు వినియోగిస్తూ ఈ పిటిషన్లు కొట్టివేస్తున్నట్లు స్పష్టం చేసింది. ఈ భూములపై కిందిస్థాయి కోర్టులు, హైకోర్టు ఎలాంటి జోక్యం చేసుకునే అధికారం లేదని, ఇప్పుడు ఇచ్చిన తీర్పే తుదితీర్పు అని ఆదేశాల్లో పేర్కొంది. సదరు భూమి పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వానికి చెందుతుందని, తదుపరి కేటాయింపులపై దాని యాజమాన్య, స్వాధీన హక్కులు ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకొని గ్రేహౌండ్స్‌కు బదిలీ చేయాలని చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులను సమర్థించింది. తెలంగాణ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాదులు కేకే వేణుగోపాల్, సీఎస్ వైద్యనాథన్, గిరి, ఏఓఆర్ శ్రీహర్షలు వాదనలు వినిపించారు. ఓఆర్ఆర్‌కు ఆనుకొని ఉన్న ఈ భూములు పలువురు ఆక్రమించుకొని 1993లో అక్రమంగా విక్రయించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ఆ విషయాన్ని గుర్తించి వారికి నోటీసులు జారీ చేసింది.

రూపు మారుతున్న ఉత్తరాంధ్ర

విశాఖపట్నంకు ఇనార్బిట్ మాల్: ఏపీ సీఎం వైఎస్ జగన్

- రూ. 600 కోట్లతో 12 – 13 ఎకరాల్లో భారీ స్థాయిలో నిర్మాణం
- 8 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి
- రెండో దశలో 2.5 లక్షల చదరపు అడుగుల్లో 'ఐటీ స్పేస్'.. మరో 3 వేల జాబ్స్
- అంతర్జాతీయ స్థాయిలో కన్వెన్షన్ సెంటర్ దిశగా ప్రణాళికలు
- నగరంలో 7 స్టార్ హోటల్ నిర్మాణానికి రహేజా ఉత్సాహం

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: విశాఖ అభివృద్ధికి మరింత దోహదపడేలా నగరానికి ఆణిముత్యంలా ఇనార్బిట్ మాల్ నిలిచిపోతుందని ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం విశాఖ పర్యటన సందర్భంగా కైలాసపురం ప్రాంతంలో రూ.600 కోట్ల పెట్టుబడులతో రహేజా గ్రూప్ చేపట్టిన ఇనార్బిట్ మాల్ నిర్మాణ పనులకు సీఎం జగన్ భూమి పూజ చేశారు. రూ.134.58 కోట్లతో జీవీఎంసీ తలపెట్టిన అభివృద్ధి పనులకు సీఎం చేతుల మీదుగా శంకుస్థాపన జరిగింది. ఆంధ్రా యూనివర్సిటీలో రూ.130 కోట్లతో నిర్మించిన ఐదు భవనాలను సీఎం ప్రారంభించారు. దక్షిణాది లో అతి పెద్దదైన ఇనార్బిట్ మాల్‌తో పాటు 2.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఐటీ స్పేస్, కన్వెన్షన్ సెంటర్‌ను కూడా తర్వాత దశలో రహేజా సంస్థ నిర్మించనుందని సీఎం జగన్ వెల్లడించారు. కేటాయించిన మొత్తం స్థలం విస్తీర్ణం 17 ఎకరాలు కాగా 12–13 ఎకరాల్లో మాల్ ఏర్పాటు కావడం చాలా తక్కువ ప్రాంతాల్లో మాత్ర మే జరుగుతుందన్నారు. ఇదే రహేజా గ్రూప్ హైద రాబాద్‌లో ఇనార్బిట్ మాల్‌ను కేవలం 7–8 ఎకరా ల్లో నిర్మించగా విశాఖలో 12–13 ఎకరాల్లో నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్నామని గుర్తు చేశారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే...



ఇనార్బిట్ మాల్‌కు శంకుస్థాపన చేస్తున్న సీఎం జగన్. చిత్రంలో నీల్ రహేజా

ఉత్తరాంధ్ర రూపురేఖలు మార్చేలా..

ఇంత భారీ మాల్ ఏర్పాటుతో విశాఖ రూపురేఖలు మారడమే కాకుండా దక్షిణాదిలో అతి పెద్దదిగా నిలవనుంది. 8 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు లభిస్తాయి. 12–13 ఎకరాల్లో మాల్ నిర్మాణం పూర్తయిన తరువాత 2 దశ కింద మిగిలిన 4 ఎకరాల్లో 2.5 లక్షల చదరపు అడుగుల్లో ఐటీ స్పేస్ కూడా అందుబాటులోకి రానుంది. అంతర్జాతీయ స్థాయిలో కన్వెన్షన్ సెంటర్ నిర్మాణానికి కూడా ప్రణాళికలు రూపొందించారు. ఐటీ స్పేస్ ద్వారా మరో 3 వేల మందికి ఇక్కడ ఉద్యోగాలు రానున్నాయి. గత పర్యటన సందర్భంగా విశాఖలో అదానీ డేటా సెంటర్, ఐటీ స్పేస్, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి శంకుస్థాపన చేశాం. ఇవన్నీ రానున్న రోజుల్లో విశాఖ, ఉత్తరాంధ్ర రూపురేఖలు మార్చేలా గొప్ప అడుగులు అవుతాయి. మాల్ కూడా అదే కోవలోకి వస్తుంది.

సాగర తీరంలో 7 స్టార్ హోటళ్లు..

రహేజా గ్రూప్ దేశంలో పలు చోట్ల ఫైవ్‌స్టార్ హోటళ్లను నిర్మించింది. అదేవిధంగా ఏపీలో కూడా రాజ్ విలాస్ తరహాలో సూపర్ లగ్జరీ ఫైవ్‌స్టార్, 7 స్టార్ హోటళ్ల నిర్మాణం కానున్నాయి. ఇప్పటికే ఒబెరాయ్ సంస్థ రాజ్ విలాస్ తరహాలో 7 స్టార్ కేటగిరీలో రిసార్ట్, మే ఫెయిర్ సంస్థ సూపర్ లగ్జరీ 7 స్టార్ హోటళ్ల నిర్మాణానికి ముందుకొచ్చాయి. అదే తరహాలో నీల్ రహేజా కూడా 7 స్టార్ హోటల్‌ను నిర్మించేందుకు ముందుకు వచ్చారు. ఇవన్నీ విశాఖ రూపురేఖలను మార్చే గొప్ప ప్రాజెక్టులు అవుతాయి. ఇక హిందూపూర్‌లో 350 ఎకరాల్లో ఎలక్ట్రానిక్స్, టెక్స్‌టైల్స్‌కు సంబంధించిన పార్క్ రానుంది. దీని ద్వారా 15 వేల మంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. యుద్ధ ప్రాతిపదికన ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు నీల్ రహేజా తెలియచేశారు.

ఏపీలో ఎంతో అనువైన వాతావరణం

దార్శనిక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో వ్యాపారాభివృద్ధికి ఎంతో అనువైన వాతావరణం ఉంది. అతి తక్కువ సమయంలో ఈ ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు చేయడం శుభ పరిణామం. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఆంధ్రప్రదేశ్ వరుసగా అగ్రస్థానంలో నిలవడానికి ఇవే కారణం. ఈ మాల్ ప్రజల షాపింగ్ అవసరాలు తీర్చడమే కాకుండా ఆహ్లాదకరమైన, వినోదాత్మక ప్రదేశంగా అందరినీ ఆకట్టుకుని అలరిస్తుంది.
– రజనీష్ మహాజన్, ఇనార్బిట్ మాల్ సీఈవో

మాల్ ఆఫ్ ఇండియాగా తీర్చిదిద్దుతాం

ఇక్కడ త్వరలో నిర్మించబోయే ఐటీ స్పేస్ ద్వారా ఐటీ రంగం అభివృద్ధి కార్యక్రమాలను చేపడతాం. మాకు ప్రపంచవ్యాప్తంగా రాజీవిల్లాల తరహాలో లగ్జరీ హోటళ్లున్నాయి. అదే కాన్సెప్ట్‌ను విశాఖతో పాటు ఏపీలో తేవాలనుకుంటున్నాం. రాష్ట్రాభివృద్ధిలో కీలకమైన పారిశ్రామిక పార్కులపై కూడా దృష్టి సారిస్తున్నాం. హిందూపూర్‌లో 350 ఎకరాల్లో టెక్స్‌టైల్స్, ఎలక్ట్రానిక్ హార్డ్‌వేర్ పార్కు అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేస్తున్నాం. దీని ద్వారా 15 వేల ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయి. విశాఖలో ఇనార్బిట్ మాల్‌ను దుబాయ్ మాల్, మాల్ ఆఫ్ ఎమిరేట్స్ తరహాలో ప్రపంచ స్థాయి మాల్‌గా అభివృద్ధి చేస్తున్నాం. మాల్ ఆఫ్ ఇండియాగా తీర్చిదిద్దుతాం.
– నీల్ రహేజా, రహేజా గ్రూప్ ప్రెసిడెంట్

రాష్ట్రంలో 39 అమృత్ భారత్ స్టేషన్లు

- తొలిదశలో 21 రైల్వే స్టేషన్లలో అభివృద్ధి పనులకు 6న ప్రధాని శంకుస్థాపన
- వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్న మోదీ



సాక్షి, న్యూఢిల్లీ: అమృత్ భారత్ స్టేషన్ల పథకంలో భాగంగా తెలంగాణలోని మొత్తం 39 రైల్వే స్టేషన్లను గుర్తించి వీటిని సంపూర్ణంగా ఆధునీకరించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో మొదటి విడతగా 21 స్టేషన్లకు సంబంధించిన పనులను ఆగస్టు 6న ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారని తెలుస్తోంది.

'అమృత్ భారత్ స్టేషన్ల'పథకంలో భాగంగా.. రైల్వే స్టేషన్లను ఆధునీకరించడంతోపాటు స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచి ప్రయాణికులకు వెయిటింగ్ హాల్స్, టాయిలెట్స్, లిఫ్టులు, ఎస్కలేటర్లు, ఉచిత వై–ఫై సదుపాయాన్ని కల్పిస్తారు. అదేవిధంగా స్థానిక ఉత్పత్తులకు సరైన గుర్తింపు కల్పించేందుకు 'వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్' దుకాణాలు, ప్రయాణీకులకు అవసరమైన సమాచారం అందించే వ్యవస్థలు, ఎగ్జిక్యూటివ్ లాంజ్‌లు ఏర్పాటు చేస్తారు. స్టేషన్ ముందు, వెనక భాగాల్లో మొక్కల పెంపకంతో పాటు చిన్న గార్డెన్లు కూడా నెలకొల్పుతారు. ఇక స్టేషన్ల అవసరాలకు అనుగుణంగా బిజినెస్ మీటింగ్స్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు కూడా చేయనున్నారు. వీటికి తోడుగా నగరానికి ఇరువైపులా ఉన్న ప్రాంతాలను అనుసంధానం చేయడం, దివ్యాంగులకోసం ప్రత్యేక ఏర్పాట్లు, పట్టాలకు ఇరువైపులా కాంక్రీట్ బాటలు, రూఫ్ ప్లాజాలు (అవసరాన్ని బట్టి), దీర్ఘకాలంలో అవసరమయ్యే నిర్మాణాలను ఈ పథకంలో భాగంగా చేపట్టనున్నారు. కాగా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో వచ్చే 40 ఏళ్ల అవసరాలు తీర్చేవిధంగా అభివృద్ధి చేసేందుకు రూ.715 కోట్లు, చర్లపల్లి టర్మినల్ అభివృద్ధికి రూ.221 కోట్లను కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే కేటాయించిన విషయం తెలిసిందే.

తెలంగాణలో మొత్తం గుర్తించిన స్టేషన్లు 39: ఆదిలాబాద్, బాసర్, బేగంపేట్, భద్రాచలం రోడ్, గద్వాల్, హఫీజ్‌పేట్, హైటెక్ సిటీ, ఉప్పుగూడ, హైదరాబాద్ (నాంపల్లి), జడ్చర్ల, జనగాం, కాచిగూడ, కామారెడ్డి, కరీంనగర్, కాజీపేట జంక్షన్, ఖమ్మం, లింగపల్లి, మధిర, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, మలక్‌పేట్, మల్కాజ్‌గిరి, మంచిర్యాల్, మేడ్చల్, మిర్యాలగూడ, నల్లగొండ, నిజామాబాద్, పెద్దపల్లి, రామగుండం, సికింద్రాబాద్, షాద్‌నగర్, శ్రీ బాల బ్రహ్మేశ్వర జోగులాంబ, తాండూర్, ఉందానగర్, వికారాబాద్, వరంగల్, యాదాద్రి, యాకుత్‌పురా, జహీరాబాద్.

- మొదటి విడతలో ఆగస్టు 6న పనులు ప్రారంభం కానున్న 21 స్టేషన్లపై రూ.894 కోట్లు ఖర్చుచేయనున్నారు.

హైదరాబాద్ (నాంపల్లి) – రూ.309 కోట్లు	
నిజామాబాద్ – రూ.53.3 కోట్లు	
కామారెడ్డి – రూ.39.9 కోట్లు	
మహబూబ్‌నగర్ – రూ.39.9 కోట్లు	
మహబూబాబాద్ – రూ.39.7 కోట్లు	
మలక్‌పేట్ (హైదరాబాద్)– రూ.36.4 కోట్లు	
మల్కాజ్‌గిరి (మేడ్చల్) – రూ.27.6 కోట్లు	
ఉప్పుగూడ (హైదరాబాద్)– రూ.26.8 కోట్లు	
హఫీజ్ పేట (హైదరాబాద్) – రూ.26.6 కోట్లు	
హైటెక్ సిటీ (హైదరాబాద్) – రూ.26.6 కోట్లు	
కరీంనగర్ – రూ.26.6 కోట్లు	
రామగుండం (పెద్దపల్లి)– రూ.26.5 కోట్లు	
ఖమ్మం – రూ.25.4 కోట్లు	
మధిర (ఖమ్మం) – రూ.25.4 కోట్లు	
జనగాం – రూ.24.5 కోట్లు	
యాదాద్రి – రూ.24.5 కోట్లు (యాదాద్రి భువనగిరి)	
కాజీపేట జంక్షన్ – రూ.24.5 కోట్లు (హనుమకొండ)	
తాండూర్ (వికారాబాద్)– రూ.24.4 కోట్లు	
భద్రాచలం రోడ్ – రూ.24.4 కోట్లు (కొత్తగూడెం)	
జహీరాబాద్ (సంగారెడ్డి)– రూ.24.4 కోట్లు	
ఆదిలాబాద్ – రూ.17.8 కోట్లు	

బ్రో.. ఇది పెద్ద స్కామ్.. నిర్మాత ద్వారా పవన్‌కు బాబు ప్యాకేజీ

ఏపీ మంత్రి అంబటి రాంబాబు



సాక్షి, అమరావతి: తనను కించపరిచేలా బ్రో సినిమాలో ఓ పాత్ర పెట్టి పవన్ కల్యాణ్ శునకానందం పొందుతున్నారని ఏపీ జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు మండిపడ్డారు. బ్రో సినిమా అట్టర్ ఫ్లాప్ అయ్యిందన్నారు. కలెక్షన్లు పెంచుకో వడం కోసమే తన పాత్రపై వివాదం సృష్టిస్తున్నా రని ఆరోపించారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవా రం మంత్రి అంబటి మీడియాతో మాట్లాడారు. బ్రో సినిమా నిర్మాత టీజీ విశ్వప్రసాద్‌కు అమెరికాలో సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఉన్నాయన్నారు. చంద్రబాబు ముఠా అమెరికాలో డబ్బులు వసూలు చేసి విశ్వప్రసాద్‌కి ఇస్తే.. ఆ మొత్తాన్ని పవన్ కల్యాణ్‌కు ప్యాకేజీ రూపంలో అందించారని తీవ్ర విమర్శలు చేశారు. దీనికి ఆధారాలు ఏమిటని ఒక విలేకరి ప్రశ్నించగా.. అంతర్జాతీయ నిఘా సంస్థకు చెందిన ప్రముఖుడొకరు తనకి విషయాన్ని చెప్పారని అంబటి వెల్లడించారు. తన రెమ్యూనరేషన్ కింద రూ.66 కోట్లు తీసుకున్నారా? లేక రూ.80 కోట్లు తీసుకున్నారా? ఈ మొత్తానికి ఆదాయపన్ను శాఖకు లెక్కలు చెప్పారా? అనేది పవన్ చెప్పాలని డిమాండ్ చేశారు. రెమ్యూనరేషన్ కింద రోజుకు రూ.2 కోట్లు తీసుకున్నారని ఒకరు, 40 రోజులు కాల్షీట్లు ఇచ్చారని ఒకరు, 23 రోజులే ఇచ్చారని ఒకరు చెప్పారని గుర్తు చేశారు. 40 రోజులపాటు కాల్షీట్లు ఇచ్చి ఉంటే పవన్‌కు రూ.80 కోట్లు ముట్టినట్టు స్పష్టంగా తెలుస్తోందన్నారు. నిర్మాత విశ్వప్రసాద్ బ్లాక్ మనీని వైట్‌గా చేసి పవన్‌కు ప్యాకేజీ రూపంలో ఇచ్చారని ఆరోపించారు. ఇది ఒక కుంభకోణమన్నారు.

జిల్లా వార్తలు

6న ఈఅండ్‌ఎం (ఏఈ) రాతపరీక్ష

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ పరిధిలో ఖాళీగా ఉన్న 24 ఈఅండ్‌ఎం(ఏఈ) ఇంటర్నల్ పోస్టుల భర్తీకి ఈ నెల 6న రాతపరీక్ష నిర్వహించనున్నారు. కొత్తగూడెంలోని సింగరేణి మహిళా డిగ్రీ కళాశాలలో ఈ పరీక్ష జరగనుంది. యాజమాన్యం మార్చిలో నోటిఫికేషన్ ఇవ్వగా సింగరేణివ్యాప్తంగా 11 ఏరియాల నుంచి 600 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 549 మందికి హాల్‌టికెట్లు జారీ చేసి, పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.

ఎక్స్‌టర్నల్ నోటిఫికేషన్ ఎన్నడు?

సింగరేణిలో సుమారు 280 పోస్టుల (ఎక్స్‌టర్నల్) భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేస్తామని అధికారులు ఏడు నెలల కిందట వెల్లడించారు. అయినా ఇప్పటికీ నోటిఫికేషన్ రాలేదని నిరుద్యోగులు వాపోతున్నారు. 2017లో సుమారు 250 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చాక మళ్లీ ఇప్పటివరకు ఇవ్వకపోవడం సరికాదని, ఇకనైనా యాజమాన్యం స్పందించాలని కోరుతున్నారు.

డ్రమ్ సీడర్ ద్వారా తగ్గనున్న ఖర్చు



రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తల్లాడ: వరి సాగులో డ్రమ్ సీడర్ వినియోగం ద్వారా ఖర్చు తగ్గడమే కాక దిగుబడి పెరుగుతుందని వైరా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త జెస్సీ సునీత తెలిపారు. తల్లాడ మండలం కుర్నవల్లిలో మంగళవారం డ్రమ్ సీడర్ విధానంలో వరి సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ విధానం అవలంబిస్తే ఎకరాకు రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు ఖర్చు తగ్గుతుందన్నారు. అలాగే, పంట ముందే కోతకొచ్చి దిగుబడి పెరుగుతుందని చెప్పారు. తక్కువ కాల పరిమితి కలిగిన వరి రకాలను డ్రమ్ సీడర్ ద్వారా సాగు చేసుకోవాలని వివరించారు. కార్యక్రమంలో అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల విద్యార్థులు అనూష, అఖిల, రేతిక, ప్రసన్న, మనీషా, రైతులు ఐలూరి వెంకటకోటి సత్యనారాయణరెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

స్వచ్ఛ బృందం పర్యటన

చింతకాని: మండలంలోని పరిధిలోని నాగులవంచ గ్రామాన్ని స్వచ్ఛ సర్వేక్షణ్ రాష్ట్ర పరిశీలకులు వెంకట్ మంగళవారం సందర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులే కాక పారిశుద్ధ్య, పల్లె ప్రగతి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బృందం సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వర్షాలతో బొగ్గు ఉత్పత్తిలో వెనుకంజ

- జూలైలో సింగరేణివ్యాప్తంగా 87 శాతం నమోదు
- 100 శాతం సాధించిన ఐదు ఏరియాలు



రుద్రంపూర్ ఆర్‌సీహెచ్‌పీ ద్వారా రవాణా చేస్తున్న బొగ్గు

సింగరేణి(కొత్తగూడెం): రాష్ట్రవ్యాప్తంగా జూలై మాసంలో కురిసిన వర్షాలు సింగరేణిలో బొగ్గు ఉత్పత్తిపైప్రభావం చూపాయి. సంస్థ వ్యాప్తంగా లక్ష్యంలో 13 శాతం మేర ఉత్పత్తికి కోత పడింది. జూలైలో సింగరేణివ్యాప్తంగా 11 ఏరియాల్లోని 18 ఓపెన్‌కాస్ట్ గనులు, 24 భూగర్భ గనుల్లో కలిపి 47.92 లక్షల టన్నుల లక్ష్యానికి గాను 41.53 లక్షల టన్నుల (87 శాతం) ఉత్పత్తి నమోదైంది. ఓసీల్లో 41.36 లక్షల టన్నుల లక్ష్యానికి 37.53 లక్షల టన్నులు (91 శాతం), భూగర్భ గనుల్లో 6,56,928 టన్నులకు గాను 4,00,718 టన్నుల (61 శాతం) ఉత్పత్తి జరిగిందని అధికారులు వెల్లడించారు.

ఐదు ఏరియాల్లో ఓకే..

సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాలకు సంబంధించి జూలైలో ఐదు ఏరియాలు వంద శాతం ఉత్పత్తి సాధించాయి. మణుగురు ఏరియా 7,76,500 టన్నులకు గాను 10,46,500 టన్నుల (124 శాతం) ఉత్పత్తితో అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాత కొత్తగూడెం ఏరియాలో 9,77,760 టన్నులకు 10,39,673 టన్నులు (106 శాతం), ఆర్జీ–3 ఏరియాలో 3,55,200 టన్నులకు గాను 3,71,909 టన్నులు (105 శాతం), బెల్లంపల్లి ఏరియాలో 1,92,000 టన్నులకు 1,95,184 టన్నులు (102 శాతం), ఇల్లెందు ఏరియాలో 2,04,808 టన్నులకు 2,06,750 టన్నుల (101 శాతం) ఉత్పత్తి నమోదైంది. మిగతా ఏరియాల్లో ఆర్జీ–1లో 83 శాతం, మందమర్రిలో 76 శాతం, శ్రీరాంపూర్ ఏరియాలో 72 శాతం, ఆర్జీ–2 ఏరియాలో 56 శాతం, భూపాలపల్లి ఏరియాలో 45 శాతం, ఆండ్రియాల ప్రాజెక్టులో 28 శాతం ఉత్పత్తి మాత్రమే నమోదైందని అధికారులు నివేదికలో పొందుపర్చారు.

21.25 మిలియన్ టన్నుల బొగ్గు రవాణా

సింగరేణి సంస్థ ఈ ఆర్థిక సంవత్సరం నాలుగు నెలల్లో 21.25 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయటమే కాకుండా, ఆ మొత్తం బొగ్గును రవాణా చేయటం విశేషం. గతేడాది ఇదే నాలుగు నెలల్లో 20.05 మిలియన్ టన్నులు మాత్రమే రవాణా చేయగా, ఈసారి జూలైలో వర్షాలు కురిసినా అంతకు మించి రవాణా చేయగలిగారు.

ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలి

జూలైలో కేవలం ఐదు ఏరియాల్లో మాత్రమే వంద శాతం ఉత్పత్తి నమోదైంది. ఇక నుంచైనా లక్ష్య సాధనపై అధికారులు దృష్టి సారించాలి. వర్షాలు లేని రోజు అధికంగా ఉత్పత్తి చేసి, నిల్వ చేస్తూ వర్షం వచ్చిన రోజు రవాణా చేస్తే మంచి ఫలితాలు వస్తాయి. సంస్థ నిర్దేశించిన లక్ష్యాల సాధనలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకుంటాం.
–ఎన్.బలరామ్, సింగరేణి డైరెక్టర్ (పా)

ఇజ్రాయిల్‌లో పంటల అధ్యయనానికి ఎంపిక

ఖమ్మంవ్యవసాయం: ఇజ్రాయిల్‌లో వ్యవసాయ, ఉద్యాన పంటలపై అధ్యయనానికి ఖమ్మం జిల్లా నుంచి ఇద్దరికి అవకాశం దక్కింది. ఈనెల 5 నుంచి 10వ తేదీ వరకు ఇజ్రాయిల్ దేశంలో పంటల సాగు పద్ధతులు, యంత్రాల వినియోగం, సాంకేతికతపై అధ్యయనం చేసేందుకు రాష్ట్రం నుంచి 30 మందిని ఎంపిక చేశారు. ఇందులో జిల్లా వ్యవసాయాధికారి ఎం.విజయనిర్మల, రైతుబంధు సమితి కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావుకు స్థానం దక్కింది. రాష్ట్ర ఉద్యాన శాఖ డైరెక్టర్ ఎం.హన్మంతరావు ఆధ్వర్యాన ఈ స్టడీ టూర్ సాగనుండగా, రాష్ట్ర ఉద్యాన శాఖ సలహాదారు డాక్టర్ ఈ.శ్రీనివాసరావు కూడా పాల్గొంటారు.

మూడో సారి కూడా కూలింది!



ట్రాక్‌పై శిథిలాలను తీయిస్తున్న అధికారులు

కారేపల్లి: నాణ్యతాలోపం, అధికారుల పర్యవేక్షణలేమితో కారేపల్లి మండలంలోని గాంధీపురం రైల్వేస్టేషన్ పనుల్లో అడుగడుగునా అడ్డంకులు ఎదురవుతున్నాయి. గాంధీపురంలో నిర్మిస్తున్న రైల్వేస్టేషన్ ప్రహరీ గతంలో రెండుసార్లు కూలి ప్లాట్‌ఫాం బీటలు బారింది. తిరిగి మళ్లీ నిర్మాణం చేపట్టగా మంగళవారం సాయంత్రం కూడా బీటలు బారిన ప్లాట్‌ఫాం కూలి ట్రాక్‌పై శిథిలాలు పడ్డాయి. దీంతో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడగా చీకట్లోనే జేసీబీతో శిథిలాల తొలగింపు పనులు చేపట్టారు

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

ఆర్టీసీ రీజినల్ మేనేజర్ వెంకన్న



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఎం వెంకన్న

ఖమ్మం మామిళ్లగూడెం: ఆర్టీసీపై నమ్మకంతో వచ్చే ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం ద్వారా ఆకట్టుకోవాలని ఖమ్మం రీజినల్ మేనేజర్ సీహెచ్.వెంకన్న సూచించారు. ఖమ్మం కొత్త బస్టాండ్‌లో మంగళవారం రీజియన్‌లోని డిపో మేనేజర్లు, సీఐలతో ఆయన సమావేశమయ్యారు. డిపోల్లో ప్రస్తుత స్థితిగతులు, కావాల్సిన సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం ఆర్‌ఎం మాట్లాడుతూ ఆర్టీసీని లాభాల బాటలోకి తీసుకొచ్చేలా ప్రతీ ఉద్యోగి కృషి చేయాలని తెలిపారు. సదుపాయాల కల్పనలో అందరూ సమష్టిగా పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీటీఎం బి.ప్రసాద్, డిపో మేనేజర్లు శ్రీనివాస్, దేవదానం రాజ్యలక్ష్మి, రామారావు, స్వామి, వెంకటేశ్వర్లు, అధికారులు రామ్మోహన్, బాలస్వామి, శ్రీనివాస్, రామయ్య పాల్గొన్నారు.

ఎఫ్‌ఆర్‌ఓ చలమల కుటుంబానికి 500 గజాల స్థలం



ఎఫ్‌ఆర్‌ఓ భార్య సమక్షాన స్థలం హద్దులు నిర్ధారిస్తున్న ఉద్యోగులు

రఘునాథపాలెం: గొత్తికోయల చేతిలో హత్యకు గురైన ఎఫ్‌ఆర్వో చలమల శ్రీనివాసరావు కుటుంబానికి ప్రభుత్వం ఇచ్చిన హామీలో భాగంగా 500 గజాల ఇంటి స్థలాన్ని రఘునాథపాలెంలోని జింకలతండా రోడ్డులో కేటాయించారు. రఘునాథపాలెం మండలం ఈర్లపుడికి చెందిన శ్రీనివాసరావు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అటవీ అధికారిగా విధులు నిర్వర్తించగా, గత ఏడాది నవంబర్ 22న అటవీ భూమిని రక్షించే క్రమాన గొత్తికోయల దాడిలో హత్యకు గురయ్యారు. దీంతో ప్రభుత్వం ఆయన కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతో పాటు శ్రీనివాసరావు భార్య భాగ్యలక్ష్మికి తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హరిత దినోత్సవం సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ ఉద్యోగ నియామక పత్రం అందజేశారు. ప్రస్తుతం కలెక్టర్ గౌతమ్ ఆదేశాల మేరకు ఆర్‌ఐ ప్రసాద్, సర్వేయర్ శ్రీనివాస్ రఘునాథపాలెంలోని సర్వే నంబర్ 30లో 500 గజాల ఇంటి స్థలాన్ని భాగ్యలక్ష్మి సమక్షాన హద్దులు నిర్ధారించి అప్పగించారు. కాగా, తొలుత ఖమ్మం ఎన్నెస్పీ క్యాంప్‌లో స్థలం కేటాయించగా పనులు చేపట్టే క్రమంలో ఎన్నెస్పీ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ తర్వాత నగర శివారు ధంసలాపురంలో స్థలం కేటాయించినా శ్రీనివాసరావు కుటుంబీకులు తీసుకునేందుకు ఆసక్తి చూపలేదు. చివరకు రఘునాథపాలెంలో కేటాయింగా ఆయన కుటుంబానికి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చినట్లయింది.

ప్రభుత్వంలోకి ఆర్టీసీ ఉద్యోగులు !

- ఖమ్మం రీజియన్‌లో 2,109 మందికి లబ్ధి
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉద్యోగుల సంబరాలు



ఖమ్మం బస్టాండ్‌లో కేక్ కట్ చేస్తున్న డీఎం శ్రీనివాస్

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని తాజాగా జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించారు. త్వరలో జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టనున్నారు. ఈ నిర్ణయంపై ఆర్టీసీ ఉద్యోగుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయటం ద్వారా ఖమ్మం రీజియన్‌లోని ఆరు డిపోలకు చెందిన 2,109 మంది ఉద్యోగులకు లబ్ధి జరగనుందని చెబుతున్నారు.

కొత్త బస్టాండ్‌లో సంబరాలు

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ తీసుకున్న నిర్ణయంపై ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా మంగళవారం ఖమ్మం కొత్త బస్టాండ్‌లో సంబరాలు జరుపుకున్నారు. ఖమ్మం డిపో మేనేజర్ శ్రీనివాస్ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేయగా, ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డీఎం శ్రీనివాస్ మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం పెద్ద పీట వేసిందని చెప్పారు. ఈకార్యక్రమంలో టీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి పాల్వంచ కృష్ణ, జిల్లా అధ్యక్షుడు ఎం.డీ.వై.పాషాతో పాటు ఉమామహేశ్వరావు, సెల్వరాజు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

రీజియన్‌లో ఉద్యోగుల వివరాలు

డిపో	కండక్టర్లు	డ్రైవర్లు	గ్యారేజ్ మెకానిక్‌లు	ఇతర సిబ్బంది	మొత్తం
ఖమ్మం	274	172	61	47	554
కొత్తగూడెం	127	86	41	27	281
సత్తుపల్లి	166	112	36	31	345
మధిర	105	78	27	23	233
మణుగూరు	108	102	27	24	261
భద్రాచలం	176	147	37	30	390
ఆర్‌ఎం కార్యాలయం	45				

